


# ఇదం క్షాత్రం!

ఎపీయస్ ప్రసాద్

కథలు

"జగ్గూ ఎలాగైనా చావాలి. ఆ దైవకార్యం నా చేతులమీదుగా జరగాలి!" అన్నాడు పూర్ణయ్య ఆవేశంగా, స్వామీజీ నివ్వెరపోతూ చూస్తూండగా.

ఆశ్రమంలో చేరిన రెండేళ్లలో పూర్ణయ్యలో అంత కోపం ఎన్నడూ చూడలేదు స్వామీజీ. అంత కోపం కాదు, ఎంత కోపమూ చూడలేదు అతనిలో. అందుకే బ్రహ్మచారిగా చేరిన మూడేళ్ల లోపునే బోధకుడిగా నియమించరాదన్న ఆశ్రమ నిబంధనను ఉల్లంఘించి, పూర్ణయ్యని బోధకుణ్ని చేద్దామనుకున్నారాయన. అటువంటి పూర్ణయ్య ఈనాడు వశం తప్పాడంటే కారణం అతని సోదరి ఆత్మహత్యేనని సులభంగా అర్థమైందాయనకు.

"నాయనా? ఎప్పటికో అప్పటికి మృత్యువు రాక తప్పదు. కోరి దాన్ని వరించడం దురదృష్టకరమే కానీ ..." అని అనునయించబోయారు స్వామీజీ.

"అంతటి ఘోరమైన మృత్యువును వరించేలా చేసిన పరిస్థితిని చక్కదిద్దవద్దా, స్వామీ?"

"ఆమెనా పరిస్థితిలోకి వెళ్లడానికి నువ్వు అనుమతించావు కదా, నాయనా?"

"లేదు, స్వామీ! మా నాన్నగారు మరణించాక తను నటనా రంగానికి వెళ్తానంటే నేను అభ్యంతరపెట్టలేదు. నాకు ఇష్టం లేకపోయినా. మా అమ్మగారు చిన్నప్పుడే పోయారు. నాన్నగారు కూడా గతించాక నేను సర్వసంగ పరిత్యాగి నవుదామనుకున్నాను. అప్పుడు ఆమె టీ.వీ., సినిమాలలో నటిస్తానని ఉబలాటపడింది. అందరినీ నా వలె సన్యాసులు కమ్మని నిర్బంధించలేను కదా. సరే నన్నాను. కానీ ఆమె చేరినది సినిమాల్లో కాదు, స్వామీ! ఒక క్లబ్బులో. అదీ డాన్సర్‌గా. ఎటువంటి డాన్సరో తెలుసా, స్వామీ! తాగుబోతుల ఆనందంకోసం ఒక్కొక్కటిగా దుస్తులు విడిచిపారేసే స్ట్రిప్ టీజర్‌గా.



దాన్ని అలా తయారుచేసినది ఎవరనుకున్నారు, జగ్గూ!"

"పోనీ, నాయనా? మనిషి భ్రష్టుడు కావాలని రాసి ఉన్నప్పుడు బాహ్యంగా ఎవరో ఒకరు కారణభూతమవుతారు. విధిని తప్పించడం ..."

".... దాని కర్మ కాలినప్పుడు హఠాత్తుగా ప్రత్యక్షమైన వ్యక్తి కాదు జగ్గూ. చిన్నప్పటినుంచీ మా లొకాలిటీలోనే పెరిగాడు. చదువు, సంస్కారం లేవు. ఆంబోతులా తిరిగాడు. కండలు పెంచాడు. అదరినీ అదిలిస్తూనే పబ్బం గడుపుకున్నాడు. మా అనసూయ ఏం చూసి వాడంటే ఇష్టపడిందో నాకు తెలియదు. మా ఇంటిపక్కనే ఉండే ప్రకాష్ తనను ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానన్నాడు. కానీ అనసూయ అతన్ని కాదని ఈ జగ్గూగాడిని వరించింది. ప్రకాష్ ఈనాడు పోలీస్ ఇన్‌స్పెక్టరు. జగ్గూ చూస్తే మాఫియా లీడరు. వాడివల్లే అనసూయ ఆషాగా మారి భ్రష్టురాలై, మత్తుపదార్థాలకు బానిసయి, చివరికి ప్రాణం తీసుకుంది ..."

"నీకెలా తెలుసు? నువ్వు పొరబాటు పడుతున్నావేమో?"

"పొరబాటు లేదు స్వామీ, అనసూయ డైరీ రాసుకుంది. దానిలో తనను ఎలా ఉపయోగించుకున్నారో, మత్తు మందుల రవాణాలో ఎవరి పాత్ర ఎంత ఉందో, ఏయే తేదీలలో ఎంతెంత దిగుమతి చేసుకున్నారో, పేర్లతో సహా అంతా ఉంది. జగ్గూ పేరుతోబాటు, సోమరాజు అనే పేరు కూడా ఉంది. వీళ్లే తనను పాడుచేయడానికి ముఖ్య కారకులు. విషం తాగేముందు నాకు ఉత్తరం రాసింది. క్షమించమని కోరుతూ. అప్పుడే నాకు ఆమె ఎటువంటి పాపపంకిలంలో జీవితం గడిపిందో తెలిసివచ్చింది. ఆ ఉత్తరంతో బాటే డైరీ కూడా పంపింది. అంటే ఆమె ఆంతర్యం ఏమిటన్న మాట? ఆ డైరీ సహాయంతో వాళ్లకు శిక్ష పడేలా చేయమని నన్ను ప్రాథేయపడినట్లే కదా?"

"పాపులను కూడా క్షమించే శక్తి అలవరచుకోడానికే కదా మనం ఆశ్రమంలో చేరినది..."

"స్వామీ? క్షమించే గుణానికి కూడా హద్దు ఉంటుంది. ఈ జగ్గూ నన్ను చిన్నప్పటినుంచీ వేధించాడు. 'సాధు జంతువు, సాధుజంతువు' అంటూ నన్ను ఆటలు పట్టించేవాడు. నా చెవి ఇలా కోసినట్లు ఉండడానికి కారణం వాడే కదా! ఇంకోసారి స్వర్గాన ఉన్న మా అమ్మను తిడుతున్నాడు. తిట్టద్దన్నాను. అంతే, నా చెయ్యి వెనక్కి విరిచేశాడు. ఎముక కలుక్కుమన్నా విడిచిపెట్టలేదు. ఇప్పటిదాకా నేను చేయి పైకి పూర్తిగా ఎత్తలేనన్న విషయం తమరు గమనించే ఉంటారు."

"ఆనాడు నువ్వు అతన్ని క్షమించింది అతనికంటే బలహీనుడివి కావడంచేత ...."

"అది చిన్నప్పటి మాట. కానీ తర్వాత నేను చదువుకుని చంద్రశేఖర్ బ్రదర్స్‌లో ఉద్యోగం చేసేటప్పుడు అక్కడికి వచ్చి వేధించేవాడు. అది మారణాయుధాలు, అంటే లైసెన్స్‌డ్ తుపాకీలూ అవీ అమ్మే దుకాణం. అక్కణ్నుంచి తుపాకులు, తూటాలు దొంగిలించి తెమ్మనేవాడు. లేకపోతే మా చెల్లెల్ని ఏమైనా చేస్తాననేవాడు. అనసూయ వాడితో జత్తు కలిపేది కాబట్టి, వాడితో కలిసి నాటకాలాడేది. నాకు మనో క్షోభ. చివరికి ఆ ఉద్యోగం కూడా మానేసి ఆశ్రమానికి వచ్చేశాను. వాడు నా చెల్లెల్ని ఆకర్షించి ఆ నరకకూపంలోకి నెట్టాడు."

"అదంతా గతం. ఈనాడు నువ్వు అతనికంటే మానసికంగా బలవంతుడివి. ఇప్పుడు క్షమించడంలోనే నీ ఘనత ఉంది."

"క్షమించి ఇంకొంతమంది అమ్మాయిలను పాడు చేసేందుకు జగ్గూకు అవకాశం ఇమ్మంటారా? మన్నించండి, స్వామీ? నన్ను ఆశ్రమం నుండి వెళ్లిపోయేందుకు అనుమతి ఇవ్వండి. వెళ్లి జగ్గూని పై లోకాలకు పంపే ఏర్పాటు చేస్తాను!" అన్నాడు పూర్ణయ్య దృఢంగా.

"డైరీని పోలీసులకు అప్పగిస్తే పోయేదానికి నువ్వు ఆశ్రమంలో నుండి బయటకు పోవడం దేనికి నాయనా?"

"పోలీసులనుకూడా కొనగల సామర్థ్యం జగ్గూకి ఉంది కనుక. ఈనాడు జగ్గూ సామాన్యుడు కాడు. పెద్ద బార్ అండ్ రెస్టారెంట్‌కు అధిపతి. రాజకీయ నాయకులకు సన్నిహితుడు. అసలు మనిషే దొరకడు. పోలీసులు దీన్ని రొటీన్ మేటరుగా కొట్టి పారేస్తారు కానీ నాలా కసి వాళ్లకు ఎందుకుంటుంది?"

"నువ్వు ఎంత చెప్పినా వినకుండా ఉన్నావు. దైవేచ్ఛ ఎలా ఉంటే అలా కానీ. నువ్వు ఎప్పుడు తిరిగొచ్చినా ఆశ్రమం తలుపులు నీకోసం తెరిచి ఉంటాయని గుర్తుంచుకో చాలు?"

000

"జగ్గూ ఎలాగైనా చావాలి! ఆ దైవకార్యం నా చేతులమీదుగానే జరగాలి!" అన్నాడు పూర్ణయ్య ఆవేశంగా.


"ఆ మాట ఇప్పటికి నాలుగుసార్లు చెప్పావు. చెప్పిన ప్రతిసారీ నేను హెచ్చరించాను. నీలాటి సన్యాసికి ఇటువంటి ఆలోచనలు తగవని!" అన్నాడు బాల్యమిత్రుడు ఇన్‌స్పెక్టర్ ప్రకాష్.

"ఇప్పుడు నేను సన్యాసిని కాను. ఆశ్రమంలో నుండి బయటకు వచ్చేశాను!"

"నువ్వు ఒరిజినల్ సన్యాసివి. చిన్నప్పటినుంచీ తన్నులు తినడమే కానీ, తిరగబడడం నేర్వనివాడివి!"

"పరశురాముడేమన్నాడు 'ఇదం బ్రాహ్మం, ఇదం క్షాత్రం' అన్నాడు. సాధువుగా బతకనివ్వకపోతే అడ్డు తిరిగి ఆయుధం చేపట్టమన్నాడు."

"చాల్లే, అప్పటి మాటలవి. ఈనాడు ఇదం క్షాత్రం అంటూ తిరిగితే పట్టుకుని ఉరేస్తారు. పరశురాముడు వచ్చి గొడ్డలి పట్టుకు తిరిగితే మారణాయుధాలు పట్టుకు తిరుగుతున్నందుకు జైల్లో పెడతాం. అవునూ, చంద్రశేఖర్ బ్రదర్స్‌లో ఉద్యోగం మళ్లీ సంపాదించుకున్నావుట. అక్కడ అంతా సవ్యంగానే ఉందా? లైసెన్స్ లేని వాళ్లకు




కూడా తుపాకీలు అమ్మేస్తున్నారా?"

"వాళ్లు అలాటివాళ్లు కారు. నీ పోలీసు బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు. వెళ్లి అడగ్గానే ఉద్యోగం ఇచ్చేశారు పాపం. నువ్వు ఎక్కడున్నావో ఏ పోలీస్ స్టేషన్‌లోనూ చెప్పలేదు. చంద్రశేఖరంగారే చెప్పారు నువ్వు ఎక్కడ దొరుకుతావో!"

"నేను చేసే డిపార్ట్‌మెంటే అలాంటిది. డ్రగ్స్ రవాణా అరికట్టడానికి సీక్రెట్‌గా పనిచేస్తుంది మా వింగ్. ఇన్వెస్టిగేట్ చేసేటప్పుడే నాకు తెలిసింది అనసూయ కూడా వాళ్లలో ఉందని. ఎప్పటికైనా మనసు మార్చుకుని నా వద్దకు వస్తుందేమోనన్న ఆశతోనే బ్రహ్మచారిగా ఉన్నాను. జగ్గూ చేతిలో కీలుబొమ్మయిపోయిందని గ్రహించాక ఆశ వదులుకున్నాను. వాడు ఎంత మంది ఆడవాళ్లను నాశనం చేస్తున్నాడో లెక్కే లేదు!" అన్నాడు ప్రకాశ్ విషాదంగా.

"మరి వాడిని ఉరికంబం ఎక్కించలేరా మీ డిపార్ట్‌మెంట్‌వాళ్లు?"

"అది అంత సులభమనుకుంటున్నావా? ఈ మాఫియా నాయకులు తమ చేతికి మట్టి అంటుకోకుండా పనులు చేస్తారు. వాళ్లే స్వయంగా చంపితే పట్టుకుని ఉరేయచ్చు. కానీ వాళ్లు అర్ధరూపమాత్రం ఇచ్చి తక్కినవాళ్ల చేత చంపిస్తారు. అనుచరులను బలివేస్తారు. కానీ తామెప్పుడూ డైరెక్టుగా ఇన్‌వాల్వ్ కారు!"

"అలాటి అనుచరులెవరైనా డైరీ రాసి పోలీసుల కిస్తే అప్పుడు ఉరేస్తారా?" అని అడిగాడు పూర్ణయ్య ఆతృతగా.

వెంటనే ప్రకాష్ ఎలర్ట్ అయ్యాడు. "నీ దగ్గర అలాటి డైరీ ఏమైనా ఉందా?"

"అబ్బే. లేదు. జస్ట్ ఆర్గ్యుమెంట్ కోసం .... డైరీ ఉంటే ...?"

"పూర్ణయ్యా, ఒక ఫ్రెండ్‌గా హెచ్చరిస్తున్నాను. జగ్గూ చివరి, చివరిలో మోజు తీరిపోయాక అనసూయను చాలా కష్టపెట్టాడని నాకు తెలుసు. అప్పుడు కసికొద్దీ తను ఏదైనా పుస్తకంలో రాసి నీకు పంపి ఉండవచ్చు. అలాంటిది ఏదైనా ఉంటే తక్షణం పోలీసులకు ఇచ్చేయి!"

"ఇస్తే జగ్గూ ఉరికంబానికి ఎక్కుతాడా?"

"నిజం చెప్పాలంటే ఎక్కేందుకు ఛాన్స్‌లు తక్కువ. ఐదారేళ్ల శిక్ష పడుతుంది. జైల్లో ఉండగా వాడి కాలో, చెయ్యో విరిచేస్తాను. సరేనా? ఆ డైరీ ఇలా ఇచ్చేయ్!"

"ఐదారేళ్లు చాలదు. వాడు చావాలి!"

"అంటే డైరీ ఉందన్నమాట? పూర్ణయ్యా, అది ఎక్కడ దాచావో చెప్పు!"

"ఉండి ఉంటే అన్నాను కానీ, ఉందనలేదుగా. ఉంటుందని నా ఊహ. అంతే! అలాంటిది దొరికితే నీకిస్తానులే!" అన్నాడు పూర్ణయ్య నిబ్బరంగా.

ప్రకాష్ సాలోచనగా చూశాడు. "నువ్వు నిజం దాస్తున్నావు. నాకు తెలుసు. కానీ నీ మనసు మార్చుకుని డైరీ ఇద్దామనుకుంటే తెలియబరుచు. రెక్కలు కట్టుకుని వాల్తాను. నీకే హానీ జరక్కుండా చూస్తాను!"

000

'జగ్గూ చావాలి. ఆ దైవకార్యం నా మూలంగా జరగాలి' అనుకున్నాడు పూర్ణయ్య ఉత్తరాలు రాస్తూ. ప్రకాష్‌ని కలిసిన నెల తర్వాత అతని నిఘా ఫలించింది. జగ్గూ నడిపే హోటల్ బయట రెండు వారాలు కాచుకున్న తర్వాత సోమరాజు ఒకరోజు బయటకు వస్తూ కనబడ్డాడు. జాగ్రత్తగా అతని వెంట వెళ్లి అతను ఉంటున్న స్థావరాన్ని పసిగట్టాడు పూర్ణయ్య. అతని వెంట ఎప్పుడూ ఇద్దరు దున్నపోతుల్లాంటి మనుషులు ఉండడం కూడా గమనించాడు.

'డియర్ జగ్గూ! అనసూయ డైరీ నుండి కొన్ని పేజీలు జిరాక్స్ చేసి పంపుతున్నాను. అవి పోలీసులకిస్తే ఎంత ప్రమాదమో నీకు వేరే చెప్పనవసరం లేదు. వాటి గురించి మాట్లాడదామనుకుంటే ఆదివారం మధ్యాహ్నం 3.15కి ఈ క్రింది అడ్రసుకి రా? ఒంటరిగా రా? ఆయుధాలు లేకుండా. నా వద్ద ఆయుధాలేమీ ఉండవు. ఉన్నా, నువ్వు లాక్కోగల శక్తిశాలివి! నాకు తెలుసు. అందుకనే ధైర్యంగా, నిరాయుధుడివై రా? పూర్ణయ్య'

ఈ ఉత్తరం పూర్తవగానే సోమరాజుకి రాయడం మొదలుపెట్టాడు. కొద్ది మార్పులతో. జగ్గూని ఆదివారం మధ్యాహ్నం రమ్మన్నానని అంటూనే డైరీ నా వద్ద ఉందో, లేదో స్వయంగా వచ్చి చూసుకోవచ్చు అని చేర్చాడు. శుక్రవారం అవి పంపుతూండగానే అనుకున్నాడు 'స్వయంగా' అని రాసినా సోమరాజు తను రాకుండా ఆ దున్నపోతుల్లాటి మనుషులను పంపుతాడని. ఆ దున్నపోతులు చూడడానికే కాదు, ప్రవర్తనలో కూడా దున్నపోతులే! ఉత్తరం అందిన కొన్ని గంటల్లోనే వాళ్లు చంద్రశేఖర్ బ్రదర్స్ ఆఫీసులోకి చొచ్చుకు వచ్చారు.

"అనసూయ డైరీ ఉందట. ఇలా ఇయ్యి!" అన్నాడొకడు జబర్దస్తీగా.

"ఇది షాపు. ఇక్కడెందుకుంటుంది?" అన్నాడు పూర్ణయ్య బింకంగా.

"మరి ఉత్తరంలో అలా ఎందుకు రాశావు? వచ్చి చూసుకోమన్నవాడివి, దగ్గర పెట్టుకోవద్దా?"

"వచ్చి చూసుకోమన్నది సోమరాజుని. మిమ్మల్ని కాదు!" అన్నాడు పూర్ణయ్య ధైర్యం తెచ్చుకుని.

దున్నపోతుకి చాలా కోపం వచ్చింది. పూర్ణయ్య చేయి పట్టుకుని మెలి తిప్పాడు. "వేషాలేశావంటే లేపేస్తాం, జాగ్రత్త? నీ మొహానికి సోమరాజుగారు కావాల్సి వచ్చారా? డైరీ ఎక్కడుందో పట్టుకు రా?" అన్నాడు క్రూరంగా.

"జగ్గూ ఫోన్ చేశాడు. సోమరాజుకి ఇవ్వకుండా తనకే ఇమ్మనమని. ఇస్తే వాడు చంపుతాడు!" అన్నాడు పూర్ణయ్య చెతిని విడిపించుకుంటూ.

దున్నపోతులు నివ్వెరపోయాయి. ఒకదానితో ఒకటి గుసగుసలాడుకున్నాయి. "వాళ్లిద్దరి మధ్యా గొడవలున్నాయా? ఈ డైరీ పట్టుకుని ఎదుటివాళ్లి జైలుకి పంపిద్దామనుకుంటున్నారా?" అంటున్న పూర్ణయ్యకేసి తెల్లబోయి చూశాయి.

"ఆదివారం నీ దగ్గరకు వస్తాడుగా. డైరీని జగ్గూనే తీసుకోమను. తర్వాత వాడి దగ్గర ఎలా తీసుకోవాలో మేం చూసుకుంటాం. వెనకాల గోతులు తవ్వడం మాకూ తెలుసు. పదరా, బాస్‌కి చెబుదాం? ఈ అర్భక నాయాలతో పనేమిటి?" అంది పెద్ద దున్నపోతు కాసేపటికి.

తను ఎటువంటి మనుషులతో డీల్ చేస్తున్నాడో తెలిసివచ్చింది పూర్ణయ్యకు. తన వద్ద ఉన్న డైరీని తీసుకోవడానికి వాళ్లు ఎంతకు తెగిస్తారో ప్రత్యక్షంగా అనుభవమైంది.

000

"డియర్ ప్రకాష్, అనసూయ డైరీ నా వద్ద ఉండి నేను సాధించగలిగేదేమీ లేదు. నేను ఒక్కణ్ణే వాళ్లను ఎదిరించలేను. పోలీసులైతే కాస్తో, కూస్తో శిక్షయినా పడేటట్లు చేయగలరు. నేనైతే అదీ చేయలేను. నువ్వు వెంటనే రావలసినది. డైరీ నీకిచ్చేసి, నేను సుదూర తీరాలకు వెళ్లిపోతాను. అనసూయపట్ల, నా పట్ల నీకున్న ప్రేమవల్ల జగ్గా, సోమరాజులకు తగిన శిక్ష పడేటట్లు చేస్తావని నాకు గట్టి నమ్మకం. వెంటనే వస్తేనే డైరీ దక్కుతుంది. దానికోసం జగ్గా మూడు గంటలకు వస్తానన్నాడు. ప్రతీ క్షణం అమూల్యమైనదే! నీ మిత్రుడు పూర్ణయ్య."

కుర్రవాడు తెచ్చిన ఉత్తరం చదివి కంగారుపడ్డాడు ప్రకాష్. వాచీ చూసుకున్నాడు. మూడు గంటల పది నిముషాలయింది. వెంటనే బయలుదేరినా మూడున్నరకు చేరగలడు. ఈలోపున జగ్గా డైరీ లాక్కుని వెళ్లిపోయి ఉండవచ్చు. ఈ పూర్ణయ్య తెలివితక్కువతనం వల్ల డైరీ చేజారిపోతోంది. గబగబా యూనిఫాం వేసుకుంటూనే జీపు డ్రైవరుని సిద్ధం కమ్మన్నాడు.

జగ్గా ఆపాటికే పూర్ణయ్య ఇంటికి చేరాడు. తన మనుషులను బయట అట్టేపెట్టి, భారంగా అడుగులు వేస్కుంటూ మెట్లెక్కాడు. చిన్న గది. పూర్ణయ్య ఒక మూల కూర్చుని ఉన్నాడు.

"ఏరా సాధు జంతువూ? నాకు ఉత్తరాలు రాసి రమ్మనేటంత ధైర్యం ఎలా వచ్చిందిరా?" అన్నాడు జగ్గా హేళనగా. అంటూనే పూర్ణయ్యను రెండు చేతులా గట్టిగా పట్టుకుని అతని జేబులు వెతికాడు. ఒళ్లంతా తడిమి చూశాడు. పరుపు కింద కూడా ఎత్తి చూస్తూ ఉంటే "తుపాకి ఉందేమోననా? నేనంటే అంత భయమా?" అన్నాడు పూర్ణయ్య వెక్కిరిస్తూ.

వెతకడం మానేసి, జగ్గా భుజాలు ఎగరేశాడు. "నీలాంటి సన్నాసి ముండాకొడుకులకు భయపడేటట్లయితే నేను ఈ బిజినెస్‌లో ఉన్నట్టే? సన్నాసివి, సన్నాసిలా ఉండక డబ్బు యావ పట్టుకుందేరా?" అన్నాడు.

"డబ్బా? డబ్బు ఎక్కడ అడిగాను?" అన్నాడు పూర్ణయ్య ఆశ్చర్యపడుతూ.

"మరెందుకు రమ్మన్నట్టు? డైరీ ఇచ్చి డబ్బుడుగుదామనేగా?" అన్నాడు జగ్గా పొగరుగా.

"అలా ఎవరన్నారు? ఆ డైరీతో నిన్ను జైలుకి పంపుతున్నానని చెప్పడానికే పిలిచాను."

జగ్గా పగలబడి నవ్వాడు. "చాలా గొప్పగా ఉంది. ఆ డైరీ అంత ముఖ్యమైనదను కుంటున్నావా? అది ఓ పిచ్చిది రాసిన డైరీ? దాన్ని పట్టించుకునే దెవడు?"

"అనసూయ పిచ్చిదా?"

"కాకపోతే? డ్రగ్స్ విపరీతంగా తీసుకుని తీసుకుని పిచ్చిదయిపోయింది. అప్పుడు ఏదో గిలికిపారేసింది. అవి ఆధారంగా తీసుకుని కోర్టువాళ్లు శిక్ష వేస్తారనుకుంటున్నావా? అసలు మా పార్టనర్ సోమరాజు అననే అన్నాడు, 'ఎందుకు గురూ, నువ్వు స్వయంగా వెళ్లి డైరీ తీసుకోవడం. వదిలెయ్!' అని. నేనే పోన్లే, ఎందుకొచ్చిన న్యూసెన్సు. మన పూర్ణయ్యకు కాస్త డబ్బు పడేస్తే నష్టమేమిటి" అని వచ్చాను.

"సోమరాజు నీతో అలా అన్నాడా? ఆ డైరీ చాలా ముఖ్యమైనదనీ, దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నీకు ఇవ్వద్దనీ నాకు కబురంపించాడే! నువ్వు మరీ మొండికేస్తే ఉపయోగించమని ఇది ఇచ్చాడే ..."

జగ్గా కన్నుమూసి తెరిచేలోగా పూర్ణయ్య చేతిలో తుపాకీ ప్రత్యక్షమైంది. కిటికీ కర్టెన్ల వెనుక దాచినట్టున్నాడు. తుపాకీ చూడగానే జగ్గా మనసులో ఆలోచనలు పరుగుపెట్టాయి. డైరీ సహాయంతో తనను జైలుకి పంపి తన వాటా కూడా కొట్టేద్దామని చూస్తున్నాడా సోమరాజు? తనకు ఉత్తరం రాగానే పూర్ణయ్యమీద నిఘా పెట్టమని చెప్పాడు. పూర్ణయ్య పనిచేసే షాపుకి సోమరాజు మనుషులు వచ్చి వెళ్లారని తెలుస్తుంది. అది తుపాకీలు అమ్మే షాపు కాబట్టి వాళ్లకు వేరే పనిబడి వచ్చారనుకున్నాడు. కనీ వరస చూస్తుంటే సోమరాజు తన మీద కుట్ర పన్నినట్టే ఉంది. లేకపోతే ఈ పూర్ణయ్యగాడికి తుపాకీ ఇచ్చేదెవడు?

"డైరీ విషయం మరిచిపో? అది నీకు చచ్చినా ఇవ్వను. అనసూయకు చేసిన ద్రోహానికి శిక్ష నా చేతులమీదుగా అనుభవించు!" అంటూ పూర్ణయ్య తుపాకీ కాల్చబోయాడు. కానీ సరిగ్గా పేలలేదు. ఎక్కడ పొరబాటయిందాని దానికేసి చూసిన ఒక్క క్షణం చాలు జగ్గాకి. మీదపడి తుపాకీ లాక్కున్నాడు. సోమరాజుతో చేతులు కలిపి తనను చంపాలని చూసిన పూర్ణయ్యమీద కోపం ఉవ్వెత్తున వచ్చింది. సోమరాజు ఉంటే ఇద్దర్నీ కలిపి కాల్చేవాడే. వాడు లేకపోవడంతో ఆ కోపం కూడా పూర్ణయ్య మీద మళ్లింది.

"ఒరేయ్ సాధుజంతువూ? పోనీ కదాని ఊరుకుంటే ఇంత దూరం వచ్చావు. నువ్వే లేకుంటే నీ డైరీ ఎక్కడుంటే నాకేంట్రా?" అంటూ తుపాకీ కాల్చాడు.

పరుగు పరుగున మెట్లెక్కుతున్న ప్రకాష్ తుపాకీ పేలిన శబ్దం వింటూనే ఎలర్ట్ అయ్యాడు. రివాల్వర్ చేతిలోకి తీసుకుంటూనే తలుపు తోశాడు. ఈ లోపునే జగ్గా రెండోసారి కూడా కాల్చడం జరిగింది. నేలమీద రక్తపు మడుగులో పూర్ణయ్య. ఎదురుగా తుపాకితో జగ్గా. ప్రకాష్ ముందు వెనుక ఆలోచించలేదు. జగ్గా చేతికి గురిపెట్టి కాల్చాడు. అతని తుపాకి కిందపడింది. ప్రకాష్ వెంటనున్న కానిస్టేబుల్స్ అతని రెక్కలు విరిచి పట్టుకున్నారు.

ప్రకాష్ కిందకు వంగి, "పూర్ణయ్యా?" అని పిలిచాడు.

"ప్రకాష్? జగ్గా స్వహస్తాలతో హత్య చేశాడు. మీరంతా సాక్ష్యం. ఉరివేయడానికి ఇది చాలుగా?" అన్నాడు పూర్ణయ్య కళ్లు మూతలు పడుతూండగా.

"చాలు! కానీ, ఆ డైరీ?" అన్నాడు ప్రకాష్.

"మా షాపులో ఈ తుపాకీ ఉండాల్సిన పెట్టెలోనే ఉంది?" అని అంటూండగానే పూర్ణయ్య ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ■

# మళ్లీ హాలీవుడ్‌కే...

ఒక భారతీయ దర్శకుడు హాలీవుడ్ సినిమాకి దర్శకత్వం వహించడమే ఒక క్రెడిట్



అయితే ఆ సినిమాకి చెందిన ఒక విభాగానికి ఆస్కార్ అవార్డు రావడం మరో విశేషం....అర్థమైపోయే ఉంటుంది ఇదంతా శేఖర్‌కపూర్ గురించేనని. 'బండిట్ క్వీన్'తో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చు కున్న ఈయన తీసిన హాలీవుడ్ సినిమా 'ఎలిజబెత్'తో అంతర్జాతీయస్థాయి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు శేఖర్‌కపూర్‌ను మరో హాలీవుడ్ సినిమా వరించింది. ఈ సినిమా పేరు 'ఫాంటమ్ ఆఫ్ ది ఒపేరా'. దీని సృష్టికర్త ఆండ్రూ లాయిడ్ వెబ్బర్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సినిమా రూపొందాక ఎన్ని ఆస్కార్ అవార్డులను గెలుచుకుంటుందో....

-వల్లి